క్లుప్తంగా

జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కుంటాల: మండలంలోని అందాకూర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను ఆయన నివాసంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో ఈసారి అందాకూర్‌లో అత్యధికంగా 530 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశామన్నారు. ఆయన స్పందించి వారంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్

సారంగపూర్: సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండలంలోని జామ్ గ్రామంలోని పీఎంశ్రీ సాంఘీక సంక్షేమ బాలికల గురుకులంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళల కోసం రూపొందించిన చట్టాలు, భరోసా కేంద్రం విధులు, డయల్ 100పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచితులు ఫోన్‌చేసి వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. ప్రతి మహిళ, బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పోక్సో, గృహహింస తదితర చట్టాలు, లైంగిక వేదింపులు, అత్యాచారానికి గురైన వారికోసం భరోసా కేంద్రం రక్షణ కల్పిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో షీటీమ్ ఇన్‌చార్జి పెరిసిస్, సభ్యులు రాధిక, రజిత, సుకన్య, ఉమాభారతి, ప్రిన్సిపాల్ సంగీత పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు చెల్లించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల మూడు నెలలుగా పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ తిరుపతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు సకాలంలో వేతనాలు అందక వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపాధి పనులు క్రమక్రమంగా ఎత్తివేసే కుట్రలో భాగంగానే వేతనాలు సరైన సమయంలో చెల్లించడం లేదన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతి, జిల్లా కార్యదర్శి ముత్తన్న పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు

పెంబి: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద ఉన్న మూలమలుపు వద్ద మంగళవారం సాయంత్రం రెండుబైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇచ్చోడ మండలం సల్లెడకు చెందిన శ్రీకాంత్, పోషన్న ఖానాపూర్ నుంచి పెంబికి బైక్‌పై వెళ్తున్నారు. మామడ మండలం పరిమండల్ పరిధిలోని జయరాం తండాకు చెందిన రాథోడ్ కుమార్ సింగ్ భార్యతో బైక్‌పై పెంబి నుంచి ఖానాపూర్ వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను రెండు అంబులెన్సుల్లో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని ఎస్సై హన్మాండ్లు పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

'జంతు వ్యర్థాలు వేయొద్దు'

భైంసాటౌన్: పట్టణంలోని పార్డి(బి) మార్గంలో డంపింగ్‌యార్డులో జంతు కళేబరాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి విన్నవించారు. కమలాపూర్ గుట్ట ప్రాంతంలో హనుమాన్ ఆలయం ఉందని, ఇదేమార్గంలో మున్సిపల్ డంపింగ్‌యార్డులో ఇష్టారీతిన జంతువ్యర్థాలు, చెత్త పారవేస్తుండడంతో ఆలయానికి వెళ్లే భక్తులు, వాహనదారులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, నాయకులు పోశెట్టి, గాలి రాజన్న, దిలీప్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటా

భైంసాటౌన్: బాధితులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ అన్నారు. పట్టణంలోని తన నివాసంలో పలువురికి మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, నాయకులు ముత్యంరెడ్డి, గంగారెడ్డి, రమేశ్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

కీరదోస.. ఉపాధికి భరోసా

- కనకాపూర్‌లో సాగు చేస్తున్న రైతులు
- బస్టాండ్ ప్రాంతంలో విక్రయాలు
- కిలో రూ.80 చొప్పున కొంటున్న జనం

లక్ష్మణచాంద: వేసవిలో కీరదోసకు భలే గిరాకీ ఉంటోంది. ఈ సీజన్‌లో వీటిని కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం కనకాపూర్‌లో కీరదోస సాగుకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఏటా ఈ గ్రామంలో 10 నుంచి 15 మంది రైతులు 15 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కేవలం నాలుగు నెలలకే పంట వస్తుండడంతో లాభాలు ఆర్జిస్తున్నారు. వారి వద్ద నుంచి గ్రామంలోని 16 కుటుంబాలు కీరదోస కొనుగోలు చేసి బస్టాండ్ ప్రాంతంలో విక్రయించి జీవనోపాధి పొందుతున్నారు. కిలో రూ.80 చొప్పున జనం కొనుగోలు చేస్తుండడంతో వారికి ఆదాయం సమకూరుతుంది.


కనకాపూర్ బస్టాండ్ ప్రాంతంలో కీరదోస కొనుగోలు చేస్తున్న జనం

నాలుగు నెలలు ఉపాధి

మండలానికి ముఖ ద్వారమైన గ్రామం కనకాపూర్. దీనిగుండా నిర్మల్ నుంచి మంచిర్యాల వెళ్లే జాతీయ రహదారి 61 ఉంది. కనకాపూర్ బస్టాండ్ ప్రాంతంలో పలు కుటుంబాలు కీరదోస విక్రయించడంతో జీవనోపాధి పొందుతోంది.

రోజు అమ్ముతున్నాం



పదేళ్లుగా రైతుల నుంచి కీరదోస కొనుగోలు చేసి బస్టాండ్ ప్రాంతంలో అమ్ముతున్నా. ఇద్దరం కలిసి ఉదయం నుంచి రాత్రి వరకు రోజు కీరదోస అమ్ముతున్నాం. రోజుఖర్చులు పోను ఒకరికి రూ.వెయ్యి వస్తుంది.

– సాయినాథ్, కనకాపూర్

ఆదాయం వస్తుంది



కొన్నిరోజుల క్రితం డ్రైవర్‌గా పనిచేశా. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యా. డ్రైవింగ్ చేయడం ఇబ్బందవడంతో మానేశా. ఇంటి వద్దే ఉన్నా. కుటుంబ పోషణ కోసం గ్రామ ప్రధాన కూడలి వద్ద రైతుల నుంచి కీరదోస కొనుగోలు చేశా. ప్రయాణికులకు కీరదోస విక్రయించి జీవనోపాధి పొందాను. రోజు ఖర్చుపోను రూ.300 నుంచి రూ.400 ఆదాయం వస్తుంది.

– ముత్తన్న, కనకాపూర్

చేను వద్ద విక్రయం



ఐదేళ్ల నుంచి కీరదోస సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చింది. చేను వద్దకే వచ్చి పలువురు కొనుగోలు చేసి బస్టాండ్ ప్రాంతంలో అమ్ముతున్నారు. తాను ఆదాయం పొందడంతోపాటు మరికొందరికి ఉపాధి లభిస్తుంది.

– జనార్దన్, యువ రైతు, కనకాపూర్

నాలుగు నెలల్లో ఆదాయం



తక్కువ సమయంలో నాలుగు నెలల్లో అధిక ఆదాయం పొందే పంట కీరదోస. ఎకరాకు రూ.20 నుంచి రూ.25 వేలు ఖర్చవుతుంది. ఎకరాకు ఖర్చు పోను రూ.50 వేల వరకు ఆదాయం వస్తుంది.

– గంగన్న, దోస రైతు, కనకాపూర్

ఐదేళ్లుగా అమ్ముతున్నా..



గత ఐదేళ్లుగా గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద కీర దోస అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నా. గిరాకీ ఉంటుంది. ప్రతిరోజు తన ఖర్చులు పోను రూ.400 ఆదాయం వస్తుంది.

– భూదేవి, కనకాపూర్

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

దిలావర్‌పూర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జై బాపు, జై భీం, జై సంవిధాన్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. అనంతరం స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిదన్నారు. ఇందులో నాయకులు రాజారెడ్డి, రమణ, విద్యాసాగర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, అనిల్, షేక్ సలీం, శ్రీనివాస్, మనోహర్‌రావు, నర్సారెడ్డి, రాజు, మహేందర్ పాల్గొన్నారు.

మామడ: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. కొరటికల్‌లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్‌లో పాల్గొని గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లింగారెడ్డి, రఫీ, శ్రీనివాస్, లింగారెడ్డి పాల్గొన్నారు.

లోకేశ్వరం: కన్కపూర్‌లో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్‌లో భాగంగా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే వేణుగోపాలాచారి పూలమాల వేసి నినాదాలు చేశారు. కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి రామేశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చెర్మన్ ఆనంద్‌రావు పటేల్, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు షేఫీ, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఉన్నారు.

సారంగపూర్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు యత్నిస్తే ఊరుకోబోమని ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. చించోలి(బి) గ్రామంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి రాజ్యాంగం గొప్పతనం గురించి వివరించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.


దిలావర్‌పూర్‌లో జైబాపు, జై భీం, జై సంవిధాన్ యాత్రలో శ్రీహరిరావు

పార్టీ మండల అధ్యక్షుడు నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, చించోలి(బి) మాజీ సర్పంచ్ చాట్ల ధనశ్రీచందు, మాజీ ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు షేక్ షఫిక్ ఉన్నారు.

సోన్/లక్ష్మణచాంద/తానూరు/నర్సాపూర్(జి): సోన్ మండలం జాఫ్రాపూర్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి మండల అధ్యక్షుడు మధుకర్ రెడ్డి జాతీయ నాయకుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు గ్రామంలోని ప్రధాన వీధులలో అంబేద్కర్ గాంధీజీ చిత్రపటాలతో నినాదాలు చేసుకుంటూ ఊరేగింపుగా వెళ్లారు. లక్ష్మణచాంద మండలం వడ్యాల్‌లో అంబేద్కర్, గాంధీ, శివాజీ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. తానూరు మండలం కోలూరులో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంతోనే అన్ని వర్గాల ప్రజలకు సమానమైన హక్కులు కలుగుతున్నాయన్నారు. అనంతరం గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుండలిక్, నాయకులు పాల్గొన్నారు. నర్సాపూర్(జి) మండలం గొల్లమాడలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి మహాత్మ గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. నిర్మల్ ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, నాయకులు సమత సుదర్శన్, గోవింద్ రెడ్డి, గోపిడి గంగారెడ్డి, పాపెన్ రాజేశ్వర్, ఉమామహేశ్వర్, డాక్టర్ రాజేశ్వర్, ముత్యం పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం రథయాత్ర

నిర్మల్‌టౌన్: రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాధికారం కోసం ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ రథయాత్ర నిర్వహిస్తున్నారని పార్టీ జిల్లా కన్వీనర్ రామగిరి రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. గత 14 ఏళ్లుగా విశారదన్ పాదయాత్రలు, సభలు, సమావేశాల ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ చైతన్యం, రాజ్యాంగ విలువలు వివరిస్తున్నారని తెలిపారు. ఈనెల 14న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ కాలేజ్ గ్రౌండ్‌లో మా భూమి రథయాత్ర ప్రారంభ సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విద్యావంతులు, మేధావులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సభ్యులు షేక్ నయీమ్, సోన్న భూమేశ్, రాజు శేఖర్ ఉన్నారు



మాట్లాడుతున్న రామగిరి రవీందర్

సంక్షిప్తంగా

ఎస్పీ ప్రజావాణి వాయిదా

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ప్రతీ బుధవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల ఓ ప్రకటనలో తెలిపారు. అనివార్య కారణాలతో బుధవారం ప్రజావాణి నిర్వహించడం లేదని పేర్కొన్నారు. అర్జీదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు ఎస్సీ సంఘాల సమావేశం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు సంబంధించి బుధవారం ఎస్సీ సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూలు కులాల అధికారి రాజేశ్వర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని మొదటి అంతస్తు గల మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10:30 గంటలకు సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ సంఘాల నాయకులు హాజరుకావాలని సూచించారు.

విద్యుత్ అంతరాయం

కుభీర్: కుభీర్, సొనారి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ ఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి

లోకేశ్వరం: మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. బాగాపూర్‌లో ఇందిరమ్మ మంజూరైన ఇంటింటికి తిరిగి నిర్మించుకోవాలని అవగాహన కల్పించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు నిధులు అందజేస్తామన్నారు. ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్, కార్యదర్శులు ఉన్నారు.

నేటినుంచి దత్తాత్రేయ స్థిర ప్రతిష్ఠా మహోత్సవాలు

నర్సాపూర్(జి): గొల్లమాడలో బుధవారం నుంచి 13 వరకు దత్తాత్రేయ స్థిరప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

విగ్రహ యంత్ర ప్రతిష్ఠ ఆహ్వానం అందజేత

ఖానాపూర్: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కిష్టాపూర్‌లో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే భక్తాంజనేయ స్వామి విగ్రహ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరుకావాలని మంగళవారం ఆలయకమిటీ సభ్యులు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్‌కు మంగళవారం ఆహ్వానం అందజేశారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యాంపు కార్యాలయంలో కలిసి ఈ మేరకు ఆహ్వానాన్ని అందజేశారు. అనంతరం ఆలయ ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రామస్తులు, ఆలయకమిటీ సభ్యులు ఉన్నారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వం

లక్ష్మణచాంద: రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమని పార్టీ ఆవిర్భావ వేడుకల మండల కన్వీనర్ అడ్వాల రమేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన బీజేపీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు ముత్యం రెడ్డి, శ్రీనివాస్,రంజిత్, నర్సారెడ్డి,ఓస రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమావేశం

బాసర: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్పెషల్ అధికారి రమణ మండలంలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు అందించే సంక్షేమ పథకాలు, రాజీవ్ యువ వికాసం, సన్న బియ్యం పంపిణీపై ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీవో అశోక్ కుమార్ ఎంపీవో గంగాసింగ్, ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

ఖానాపూర్: సుర్జాపూర్‌లో శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయ ఆవరణలో మంగళవారం అఖండ హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా జరిగింది. అర్చకుడు అనీశ్ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్ష ఉపాసకులు భోగ శ్రీనివాస్ బృందం ఈ పారాయణాన్ని నిర్వహించారు.ఆదిలాబాద్‌లోని గోపాలకృష్ణ మఠం పీఠాధిపతి యోగానంద సరస్వతి హాజరై భక్తులకు పలు ప్రవచనాలను బోధించారు. యజ్ఞాచార్యులు చక్రపాణి నరసింహమూర్తి, పండితులు నితీష్ ఆచార్య పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

ఖానాపూర్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పెండింగ్ ఫైళ్లు, ధరణి సమస్యలను తెలుసుకున్నారు. అంతకుముందు తహసీల్దార్ సుజాతతోపాటు డిప్యూటీ తహసీల్దార్ మంజుల, ఆర్‌ఐలు సత్యనారాయణ, నగేశ్ తదితర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

దరఖాస్తు ఫారాలు అందించాలి

భైంసాటౌన్: రాజీవ్ యువ వికాసం పథకం సబ్సిడీ రుణాల కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నవారు సంబంధిత ఫారాలను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని కమిషనర్ బి.రాజేశ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వం అందించనున్న రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఈనెల 14 వరకు అవకాశమిచ్చిందని, దరఖాస్తు ఫారాలను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో అందించాలని పేర్కొన్నారు.

నిర్మల్ ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

నిర్మల్‌టౌన్: రాజీవ్ యువ వికాసం పథకానికి నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కౌంటర్‌లో ఈనెల 14 వరకు దరఖాస్తులు అందించాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: వేసవికాలం దృష్ట్యా నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆర్‌డబ్లుఎస్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తాగునీటి సమస్యలపై పలు సూచనలు చేశారు. భూగర్భ జలాలు అడగంటిపోతున్న నేపథ్యంలో బోరుబావులు వేయించాలని, అవసరమైతే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని సూచించారు. ప్రతీ గ్రామంలో సమస్యను గుర్తించి, తక్షణమే ప్రతిపాదనలు పంపించాలన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలను వెంటనే గుర్తించి సకాలంలో మరమ్మతు చేపట్టాలన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే పి రామారావు పటేల్ మంగళవారం పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

పేద కుటుంబంతో కలిసి భోజనం

బాసర: మండలంలోని టాక్లి గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారుడు నరసింహులు ఇంట్లో అధికారులు భోజనం చేశారు. స్పెషల్ అధికారి రమణ, ఎంపీడీవో అశోక్ కుమార్, ఎంపీవో గంగాసింగ్, ఏపీవో సదనాన్ చారి పంచాయతీ సెక్రటరీలు ఉన్నారు.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

భైంసారూరల్: పాంగ్రి గ్రామంలో రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎమ్మెల్యే రామారావుపటేల్ సన్న బియ్యం పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం ఇచ్చేది కేంద్రమేనని, కేంద్ర ప్రభుత్వం నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుందన్నారు. కేవలం ట్రాన్స్‌పోర్ట్ నిధులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. పాంగ్రి గ్రామ అభివృద్ధికి పాటుపడతానని, తక్షణమే సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.25 లక్షల నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మారెడ్డి, మాజీ సర్పంచులు ఆనందరావు పటేల్, రాందాస్, నాయకులు బాలాజీ పటేల్, రాజారాం పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): అర్లి(కే) గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. లబ్ధిదారులు సిందే భోజ భాయి -గంగాధర్ దంపతుల ఇంట్లో సన్న బియ్యంతో వండిన వంటకాలను నాయకులు, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ అశోక్, మాజీ ఎంపీపీ భోజరాం పటేల్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు మురళి, సంతోష్, రమణాగౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.


నరసింహులు ఇంట్లో భోజనం చేస్తున్న అధికారులు

సోన్: కూర్నాపల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమారెడ్డి ప్రారంభించారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో రూ.3.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, లింగన్న, అంబేకర్ ప్రసాద్, లింగన్న పాల్గొన్నారు.

అడవి పందుల నిందితులకు రిమాండ్

భైంసాటౌన్: అడవి పందుల అక్రమ రవాణా కేసులో నిందితులు ముగ్గురికి కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎఫ్ఆర్వో సట్ల వేణుగోపాల్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన సంజయ్ జాదవ్, అనిల్ జాదవ్, కృష్ణ అడవి పందులను బొలెరో వాహనంలో తరలిస్తూ ముధోల్ మండలం బోర్గాం వద్ద పట్టుబడిన విషయం తెలిసిందే. ఈమేరకు నిందితులను మంగళవారం పట్టణంలోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. డీఆర్‌ఓ శంకర్, సిబ్బంది ఉన్నారు.

సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

భైంసారూరల్: కామోల్‌లో మంగళవారం సీతారాముల కల్యాణం జరిపించారు. ఉగాది పర్వదినం మొదలుకుని గ్రామంలో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభించారు. రామనవమి రోజున జన్మదిన వేడుకలను జరిపారు. 9 రోజులపాటు సప్తాహం నిర్వహించారు. భక్తులు హాజరయ్యారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

మామడ: ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పరిమండల్ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటు కోసం మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. శివాజీ ధైర్యసాహసాలను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మండల కన్వీనర్ రంజిత్, బాపురెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మల్లేశ్, రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్


మాట్లాడుతున్న భైంసా రూరల్ సీఐ నైలు

కుభీర్: నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు భైంసా రూరల్ సీఐ నైలు తెలిపారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు మండలంలోని చొండిలో పోలీసులు మంగళవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 57 బైక్‌లు, ఒక వాహనం, ఐదు ఆటోలకు జరిమానా విధించారు. అనంతరం భైంసా రూరల్ సీఐ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. వాహనదారులు తమవెంట వాహనపత్రాలు తెచ్చుకోవాలన్నారు. భైంసా టౌన్ సీఐ శంకర్, కుభీర్ ఎస్సై పి.రవీందర్, కుంటాల ఎస్సై అశోక్ తదితరులు ఉన్నారు.

విధులు బహిష్కరించి నిరసన


నిరసనలో పాల్గొన్న న్యాయవాదులు

ఖానాపూర్: గోదావరిఖనికి చెందిన న్యాయవాది నూతి సురేష్, రంగారెడ్డికి చెందిన ముజ్తా అలీ, ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరానికి చెందిన న్యాయవాది కృష్ణపై వివిధ ఘటనల్లో జరిగిన దాడులు నిరసిస్తూ ఖానాపూర్ కోర్టు ఎదుట న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఖానాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సురేష్ మాట్లాడారు. న్యాయవాదులపై జరుగుతున్న దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిపై దాడులను అరికట్టేలా ప్రభుత్వం రక్షణ చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. ఏజీపీ ఆసిఫ్ అలీ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రాజలింగం, న్యాయవాదులు వెంకట్ మహేంద్ర, బాశెట్టి శివ, కమలాకర్, షబ్బీర్ పాషా, సలీంఖాన్, వేణు, రవి పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

భైంసారూరల్: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్సై లక్ష్మణ్ అన్నారు. మండలంలోని ఇలేగాం రహదారిపై మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ధ్రువపత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకే తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహనదారులు వాహన ధ్రువపత్రాలను తమవెంట తెచ్చుకోవాలన్నారు. మహిళా కానిస్టేబుళ్లు రజిత, స్వప్న ఉన్నారు.